ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 9 డిసెంబరు 2024

కేరళలో పెరియార్ స్మారక మండపం ప్రారంభం

● హాజరుకానున్న ముఖ్యమంత్రి స్టాలిన్


కేరళ వైక్కం ప్రాంతంలోని పెరియార్ స్మారక మండప ప్రవేశద్వారం


పెరియార్ స్మారక మండపం

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 11న కేరళ వెళ్తున్నారు. కేరళలోని వైక్కం ఆలయంలో బలహీనవర్గాల వారు ప్రవేశించిన ఉద్యమం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ ఉద్యమంలో పాలుపంచుకున్న ద్రవిడ ఉద్యమనేత పెరియార్‌కు 1994లో స్మారక మండపం నిర్మించారు. ఆ స్మారక మండపాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పునర్నిర్మించింది. మంత్రి ఈవీ వేలు పర్యవేక్షణలో పునర్నిర్మాణ పనులు జరిగాయి. ఆ స్మారక మండపంలో పెరియార్ జీవిత విశేషాలతో ఫొటోల ప్రదర్శన, గ్రంథాలయం, చిన్నారుల పార్కు ఇలా మరిన్ని అందాలను సమకూర్చారు.. ప్రవేశద్వారం వద్ద పెరియార్ విగ్రహం కూడా పెట్టారు. రూ.8.5 కోట్లతో పునర్నిర్మాణం చేపట్టినట్లు మంత్రి ఈవీ వేలు పేర్కొన్నారు. ఇలా కొత్త రూపు సంతరించుకున్న పెరియార్ స్మారక మండప ప్రారంభోత్సవం, కేరళలోని కోట్టయంలో ఈ నెల 12న పెరియార్ శతజయంతి వేడుకలు జరగనున్నాయి. కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ అధ్యక్షతన జరిగే పెరియార్ స్మారక మండపం, పెరియార్ గ్రంథాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి స్టాలిన్ కేరళ వెళ్తున్నారు.

నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు

● తొలిరోజు ప్రముఖుల మృతికి సంతాపం
● టంగ్‌స్టన్ తవ్వకాల అనుమతి రద్దుకు తీర్మానం



చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమవుతున్నాయి. రెండు రోజులపాటు జరుగనున్న ఈ సమావేశాల్లో అనుబంధ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అదే సమయంలో మదురై సమీపం మేలూరు వద్ద టంగ్‌స్టన్ తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అనుమతి రద్దు చేయాలని ప్రత్యేక తీర్మానం ప్రతిపాదించి ఆమోదించనున్నారు. గత శాసనసభ సమావేశాలు జూన్ 21 నుంచి 29 వరకు జరిగాయి. ఆ సమావేశాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 55 ఆర్థిక పద్దులను పాలకపక్షం, మిత్రపక్షాల మూజువాణి ఓటింగ్ ద్వారా ఆమోదించారు. ప్రతి ఆరుమాసాలకొకమారు శాసనసభ సమావేశాలు నిర్వహించాలన్న నిబంధన ప్రకారం డిసెంబర్‌లో శాసనసభ సమావేశాలు జరగాల్సి ఉంది. ఆ మేరకు స్పీకర్ అప్పావు ఈ నెల 9,10 తేదీల్లో శాసనసభ సమావేశాలు జరుగుతాయని ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశంలో అదనపు నిధుల కేటాయింపులకు సంబంధించి కొత్త అనుబంధ చట్ట సవరణ బిల్లు కూడా దాఖలు చేసి ఆమోదించనున్నారు. మదురై సమీపంలో టంగ్‌స్టన్ తవ్వకాలనుగాను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతి రద్దు చేయాలని ప్రత్యేక తీర్మానం ప్రతిపాదించి ఆమోదించనున్నారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమవుతుంది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరం అదనపు వ్యయాలకు సంబంధించి అనుబంధ బడ్జెట్ కూడా దాఖలు చేయనున్నారు.

కడలూరు,పుదువైలో కేంద్ర బృందం పరిశీలన


పుదుచ్చేరిలో తుఫాన్ ప్రాంతాల్లో పర్యటిస్తున్న కేంద్ర పరిశీలక బృందం సభ్యులు

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పర్యటిస్తున్న కేంద్ర బృందం ఆదివారం కడలూరు జిల్లా, పుదుచ్చేరి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించింది. కేంద్ర జాతీయ విపత్తుల నిర్వహణ మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజేష్ గుప్తా నాయకత్వంలోని కేంద్ర పరిశీలక సభ్యులు శనివారం విల్లుపురం, కళ్ళకురిచ్చి జిల్లాల్లో పర్యటించి తుపానుకు దెబ్బతిన్న వంతెనలు, రహదారులు, నీట మునిగిన పంటలను పరిశీలించారు. రాత్రి నైవేలి చేరుకుని అక్కడి ఎన్నెల్సీ అతిథి గృహంలో బసచేశారు. ఆదివారం ఉదయం కడలూరు జిల్లాలో తొలుత పకండై ప్రాంతం లో, ఆ తర్వాత నెల్లికుప్పం సమీపం మేల్‌పట్టాంబాక్కంలో పర్యటించి తుఫానుకు, వరదలకు దెబ్బతిన్న రహదారులు, చెరువుల కరకట్టలు, వంతెనలు, నీట మునిగిన పంటలను పరిశీలించారు. అళగియ నత్తం గ్రామంలో రైతులు ఆ బృందానికి తమకు పంటనష్టాన్ని త్వరగా అందజేయాలని కోరారు. అనంతరం తెన్‌పెన్నైయారు వద్ద దెబ్బతిన్న వంతెనలు, రహదారులు, నన్‌మేడు వద్ద వంటపొలల్లో వేసిన ఇసుకమేటను కూడా పరిశీలించారు. తరువాత కడలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో తుఫాన్, వరద నష్టం గురించి అడిగి తెలుసుకుని, ఫొటోల ప్రదర్శన కూడా తిలకించారు. జిల్లా కలెక్టర్ ఆదిత్యా సెంథిల్‌కుమార్, ప్రత్యేక పర్యవేక్షణాధికారి గగన్‌దీప్‌సింగ్ బేదీ, రహదారుల సంస్థ డైరెక్టర్ రామన్ తదితరులు కేంద్ర బృందానికి నివేదికలు సమర్పించారు.

పుదుచ్చేరిలో...

పుదుచ్చేరి రాష్ట్రంలో ఆదివారం మధ్యాహ్నం కేంద్ర బృందంలోని ఏడుగురు సభ్యులు తుఫాన్ ఎఫెక్ట్ ప్రాంతాలను పరిశీలించారు. బాగూరు ముల్లోడై సబ్ స్టేషన్ ప్రాంతానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ కులోత్తుంగన్ నేతృత్వంలో విద్యుత్, ప్రజాపనుల శాఖ అధికారులు తుఫాను, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ పరికరాలు గురించి వివరించారు. అక్కడి నుండి సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. రాజేష్ గుప్తా నాయకత్వంలోని కొంతమంది సభ్యులు టీఎన్ పాళయం వద్ద ఇంటింటికీ వెళ్ళి నష్టాల వివరాలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి వెళ్తున్న వీరి కారును ఇరుళర్‌పేట ప్రాంత ప్రజలు చుట్టుముట్టారు. కేంద్ర బృందం వారికి జరిగిన నష్టాలను తెలుసుకున్నారు. మరో బృందం సభ్యులు కొమందాన్‌మేడు ప్రాంతంలో పర్యటించి దెబ్బతిన్న పంటలు, రహదారులను పరిశీలించారు.

గ్రామాల్లో తక్కువ ధరకు వేగవంతమైన ఇంటర్నెట్

● రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం



పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో తక్కువ ధరకు వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 12,525 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో అధికంగా గ్రామాలకు సెల్ టవర్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఇంటర్నెట్ సేవలు అతితక్కువ వేగం మాత్రమే కలిగి ఉన్నాయి. నగర ప్రాంతాల్లో ఉన్నట్లు గ్రామీణ ప్రాంతాల్లో కూడా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, భారత్ నెట్ ద్వారా ఈ సేవలు అందించనుంది. అందుకోసం గ్రామాల్లో ఫైబర్ కేబుల్ ఏర్పాటుపనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 950 గ్రామాలకు కేబుళ్ల ఏర్పాటు పూర్తయ్యాయి. పనులు ముగిసిన గ్రామాల్లో ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడతగా వచ్చే ఏడాది మార్చి నుంచి ఆ గ్రామాల్లో అతివేగ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కానున్నాయి. అధిక ఛార్జీ రూ.150 ఉండే అవకాశముందని సమాచారం. వేగవంతమైన ఇంటర్నెట్ ద్వారా విద్యార్థులు విద్య, ఉద్యోగాలు, ప్రజలు సినిమాలు వీక్షించేందుకు అవకాశముంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

బలపడుతున్న అల్పపీడనం

● రాష్ట్రానికి భారీ వర్షసూచన

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న భూమధ్యరేఖ హిందూ మహాసముద్ర ప్రాంతానికి సమీపంలో ఏర్పడిన అల్పవాయుపీడనం రానున్న 24 గంటల్లో సోమవారం నాటికి మరింత బలపడనుందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. అల్పపీడనం వాయుగుండంగా మారటం వల్ల ఈ నెల 11 నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిపించే అవకాశాలున్నాయని తెలిపారు. సోమవారం మైలాడుదురై, నాగపట్టినం, తిరువారూరు, తంజావూరు, కడలూరు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో చెదురుమదురగా వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం సముద్రతీర జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరుగా, మరికొన్ని ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 12న పుదుచ్చేరి, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, కళ్ళకురిచ్చి, అరియలూరు, శివగంగ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించారు.

ఫెంగల్ తుఫాను బాధితుల సహాయార్థం రూ.15లక్షల విరాళాన్ని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి అందజేస్తున్న నటుడు కార్తీ



తిరువణ్ణామలై దీపోత్సవం..

కొండెక్కేందుకు భక్తులకు అనుమతి లభించేనా?


భక్తులు పర్వతారోహణ చేసే మార్గంలో వెళ్తున్న ఐఐటీ నిపుణులు

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై క్షేత్రంలో ఈ నెల 13న కార్తీక మహాదీపోత్సవాలను దర్శించేందుకు దేశవిదేశాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అదే సమయంలో ఇటీవల అరుణాచలేశ్వరాలయం వెనుకవైపునున్న పర్వతశిఖరాగ్రంలో కార్తీక మహాదీపాన్ని వెలిగించే వైపు నుండి మట్టిపెళ్లలు, బండరాళ్లు విరిగి పడటంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సహా ఏడుగురు దుర్మరణం చెందారు. ఈ నెల 13న 2668 అడుగుల ఎత్తుకలిగిన ఆ కొండ కొసన వెలిగించనున్న దీపం 11 రోజులపాటు వెలుగులు ప్రసరింపజేసి భక్తులను మైమరపించనున్నది. ఆ మహాదీపాన్ని వెలిగించే వేడుకలను తిలకించేందుకు ఆలయ సిబ్బంది భక్తులు పర్వాతారోహణ చేయడం ఆనవాయితీ. అయితే ఇటీవల ఆ ప్రాంతం వద్ద మట్టి పెళ్లలు విరిగి పడటంతో కొండెక్కే మార్గం పటిష్టంగా ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించేందుకు ఐఐటీ మద్రాసు ప్రొఫెసర్లు సహా ఎనిమిది మంది నిపుణులు విచ్చేశారు. మహదీపం వెలిగించే వేడుకలకు భక్తులు కొండెక్కే మార్గాన్ని ఆ నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ కొండ రహదారి పటిష్టంగానే ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ నిపుణుల పరిశీలన పూర్తయ్యాక మహదీపం రోజున కొండపైకి వెళ్లేందుకు భక్తులను అనుమతించాలా వద్దా అనే విషయమై ప్రభుత్వం ప్రకటన జారీ చేయనుంది.


తిరుచెందూరు ఏనుగు దాడిలో మృతి చెందిన మావటి ఉదయకుమార్ సతీమణికి కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

డీఎంకేను ఓడించాలంటే

ఆ ముగ్గురూ ఏకం కావాలి

● నటి కస్తూరి

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను ఓడించాలంటే విజయ్, అన్నాడీఎంకే, బీజేపీ ఏకం కావాలని నటి కస్తూరి అభిప్రాయపడ్డారు. హిందూ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో సనాతనం మద్దతు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరుచ్చి శ్రీరంగం తూర్పు వీధిలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హిందూ మక్కల్ కట్చి నేత అర్జున్ సంపత్, నటి కస్తూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్తూరి మీడియాతో మాట్లాడుతూ... ఈ సదస్సులో సనాతన చట్టాలు చదివిన విద్యార్థినిగా పాల్గొన్నానని తెలిపారు. బ్రాహ్మణులు ఏదైనా అభిప్రాయం చెబితే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, వారిపై వ్యతిరేకంగా ప్రచారం చేయడం అధికమైందని, వాటిని ఎలా ఎదుర్కోవాలో సదస్సులో చర్చించామని తెలిపారు. నవంబరు 3వ తేది చెన్నైలో జరిగిన నిరసన కార్యక్రమంలో నా మాటలను వక్రీకరించారన్నారు. నటుడు విజయ్ పేర్కొన్న విధంగా, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే మైనస్ అవుతుందని మాట్లాడే వారి నోట్లో చక్కెర పోస్తానని అభిప్రాయాన్ని తాను ఆహ్వానిస్తున్నానని తెలిపారు. డీపీఐలో తిరుమావళవన్, ఆధర్వ అర్జున్ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, డీఎంకే కూటమి ఎంపీగా ఉన్న తిరుమావళవన్ ఆ కూటమి నుంచి బయటకు వస్తారా అనే విషయం తెలియడం లేదన్నారు. తాను సినిమా వార్తలు చూడడం లేదని ఉదయనిధి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మరి ఆయన నేతృత్వంలో రెడ్ జెయింట్ సినిమాల విషయం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉదయించే సూర్యుడు గుర్తుకు ప్రత్యామ్నాయంగా రెండాకుల చిహ్నం మాత్రమే 60 ఏళ్లుగా ఉందన్నారు. ప్రస్తుతం విజయ్ వస్తున్నారని, ఆయన రాకతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రానున్నాయన్నారు. విజయ్, ఈపీఎస్, అన్నామలై ఏకం కాకుండా ఉండేలా డీఎంకే పక్కా వ్యూహంతో ఉందన్నారు. డీఎంకేను గద్దె దించాలన్న రాష్ట్ర ప్రజల అభీష్టం నెరవేర్చేందుకు ఆ ముగ్గురూ ఏకం కావాలని, అప్పుడు డీఎంకే విధానాలు చూడాలని కస్తూరి అన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న నటి కస్తూరి

అందరి సహకారంతో

టీటీపీఎస్‌ను ముందుకు తీసుకెళ్తాం!

● పంచమ వార్షికోత్సవంలో దేవరకొండ రాజు


రాజు దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ప్యారీస్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): ఎవరితో పోటీ పడకుండా సంస్థను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ (టీటీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు దేవరకొండ రాజు అన్నారు. తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ పంచమ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం అశోక్ నగర్‌లోని కాశీ టాకీస్ ప్రాంగణంలో జరిగింది. మా తెలుగు తల్లి ప్రార్థనాగీతం, కేక్ కటింగ్‌లతో ప్రారంభమైన ఈ వేడుకలకు దేవరకొండ రాజు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ తరుపున ఐదేళ్లుగా సమాజానికి అందించిన సేవా కార్యక్రమాలను వివరించారు. తమిళనాడులో స్థిరపడిన తెలుగు వారికి అందిస్తున్న సేవలను గురించి ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా అవార్డ్‌తో పాటు కళారంజని, ఎస్కేపీడీ వంటి సంస్థలు కూడా పురస్కారాలు ప్రధానం చేసి గౌరవం చేకూర్చాయని ఆయన అన్నారు. తాము అన్ని సంఘాలను కలుపుకుపోతున్నామన్నారు. చెన్నై మహా నగరంలో పలు రంగాల్లో రాణిస్తున్న తెలుగు ప్రముఖులులను ఒకే వేదికపై తమ సొసైటీ ద్వారా సత్కరించుకోవడం పూర్వజన్మ సుకృతమని, తమకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన వారికి సభా ముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా డాక్టర్ కిల్లంపల్లి శ్రీనివాస రావు, ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షులు జేఎం నాయుడు, చెన్నై టీడీపీ ఫోరం అధ్యక్షులు డి.చంద్రశేఖర్, నటుడు కూల్ సురేష్, తెలుగు ప్రముఖులు శోభారాజా, ప్రియా శ్రీధర్, తిరుమల శైలజ, బెల్లంకొండ శివప్రసాద్, సంపత్‌కుమార్, తదితరులు విచ్చేసి సొసైటీ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా నర్తకి శ్రేయ భరతనాట్య ప్రదర్శన అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా దేవరకొండ రాజు, సతీమణి సూర్యకుమారి వ్యవహరించారు.

తెన్‌పెన్నైయారు వరదలకు

ప్రభుత్వమే కారణం!

● ఉత్తరాది జిల్లాలపై ఎందుకింత సవతి తల్లి ప్రేమ?
● పీఎంకే నేత అన్బుమణి ధ్వజం


కండకాడు వద్ద ఓ మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అన్బుమణి

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెన్‌పెన్నైయారులో వరదలు ఏర్పడడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని, ముందస్తు హెచ్చరిక చేయకుండా సాత్తనూరు డ్యామ్ నుంచి 1.80లక్షల ఘనపుటడుగుల మేరకు అదనపు జలాలను విడుదల చేయడంతో కడలూరు, పుదుచ్చేరి ప్రాంతాలు నీటమునిగాయని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. ఆదివారం ఉదయం కడలూరు జిల్లాలోని కండకాడు ప్రాంతంలో పార్టీ తరఫున ఏర్పాటైన వైద్యశిబిరంలో ఆయన వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను బాధితులను ఆదుకోవడంలో డీఎంకే ప్రభుత్వం తారతమ్యాలను ప్రదర్శిస్తోందని, గతంలో చెన్నై, తూత్తుకుడి వరద బాధితులకు రూ.6వేల వరకు ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వం ప్రస్తుతం వరదలో మునిగిన కడలూరు, విల్లుపురం జిల్లాల్లో వరద బాధితులకు రూ.2వేల చొప్పున ఆర్థిక సాయం ఇవ్వడం భావ్యమేనా అని ప్రశ్నించారు. తుఫాను వర్షాలకు, తెన్‌పెన్నైయారు వరదలకు తీవ్రంగా నష్టపోయిన కడలూరు జిల్లా ప్రజలను ఆదుకునేందుకు మంత్రులుగానీ, అధికారులుగానీ ఇప్పటివరకూ ప్రాంతాల్లో పర్యటించి, కనీసం బాధితులను కూడా పరామర్శించలేదని ఆరోపించారు. పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆదేశాల మేరకే కడలూరు, విల్లుపురం జిల్లాల్లో పార్టీ తరఫున వరద, వర్ష బాధితుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో చెన్నై, తూత్తుకుడి జిల్లాల్లో ఏర్పడిన తుఫాను నష్టాల కంటే ఈ సారి కడలూరు, విల్లుపురం, కళ్లకురిచ్చి, సేలం, ధర్మపురి జిల్లాల్లో అత్యధికంగా వరదనష్టాలు జరిగాయని ప్రభుత్వం గుర్తించడమే లేదని అన్బుమణి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నియార్ల సంఘం అధ్యక్షులు అరుళ్‌మొళి, కోశాధికారి తిలక బామా, జిల్లా కార్యదర్శులు సన్ ముత్తుకృష్ణన్, రవిచంద్రన్, కార్తికేయన్, మహేష్, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

12న వీరరాఘవ పెరుమాళ్‌కు బంగారు కవచధారణ

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవాల్లో భాగంగా వీరరాఘవ పెరుమాళ్ బంగారు కవచధారణతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అహోబిలం మఠం ఆధీనం ఆధ్వర్యంలోని ఈ ఆలయంలో, కార్తీక దీపోత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 15వ తేది వరకు ఉత్సవమూర్తి వీరరాఘవ పెరుమాళ్ బంగారు కవచధారణతో భక్తులకు దర్శనమిస్తారని దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

మహాబలిపురంలో భారతీయ నృత్యోత్సవాలు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 లేదా 23వ తేది నుంచి భారతీయ నృత్యోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెలరోజులు జరిగే ఆ ఉత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, జానపద కళలతో సహా వివిధ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు, కరగం, కావడి వంటివి ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు.

31 వరకు జనన ధృవీకరణ పత్రాల నమోదు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో 2009కి ముందు జన్మించినవారు, జనన ధృవీకరణ పత్రంలో పేరు నమోదుకు ఈ నెల 31వ తేది చివరి రోజు కాగా, ఆ తర్వాత ఈ అవకాశం ఉండదు. అందుకోసం ప్రజలు బర్త్ సర్టిఫికెట్ కార్యాలయాలను సంప్రదించి తమ పేర్లు నమోదుచేసుకోవాలని జిల్లా కలెక్టర్ కలైసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు.

వేదగిరీశ్వరాలయానికి రోప్ కార్

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తిరుక్కళుకుండ్రంలోని వేదగిరీశ్వరాలయానికి రోప్ కార్ ఏర్పాటుకానుంది. తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళ్లలేని భక్తులు, ఈ ప్రాంతంలోని కొండ ఆలయానికి వెళ్తుంటారు. ఇందుకోసం భక్తులు 565 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. వృద్ధులు, పిల్లలు మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడుతుంటారు. భక్తుల సౌకర్యార్థం రోప్ కార్ ఏర్పాటుచేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఆలయ కొండకు పడమటి వైపు, చెంగల్పట్టు రోడ్డు నుంచి పైకి రోప్‌కార్ ఏర్పాటుచేసేందుకు మట్టి పరిశోధనలు చేపట్టనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల వివరాలు, భక్తులు వచ్చే వాహనాల సంఖ్య తదితరాలు పరిశీలించి రోప్‌కార్ ప్రాజెక్ట్ తయారీ పనులను ఓ సంస్థకు అప్పగించారు. రోప్‌కార్ అందుబాటులోకి వస్తే గంటలో 400 మంది భక్తులు ఆలయానికి వెళ్లొచ్చని అధికారులు తెలిపారు.

కో-ఆప్‌టెక్స్ దీపావళి విక్రయాలు రూ.86 కోట్లు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా కో-ఆప్‌టెక్స్ 150 షాపుల ద్వారా 30 శాతం రాయితీతో అక్టోబరు 23న ప్రత్యేక విక్రయాలు ప్రారంభించింది. వినియోగదారులను ఆకట్టుకొనేలా సరికొత్త డిజైన్లలో 700 రకాల చీరలను పరిచయం చేసింది. గత ఏడాది దీపావళి పండుగకు రూ.76 కోట్లకు కో-ఆప్‌టెక్స్ విక్రయాలు జరిగిన నేపథ్యంలో, ఈ ఏడాది రూ.100 కోట్ల విక్రయాలు చేపట్టాలని నిర్ణయించారు. నెలరోజుల ప్రత్యేక రాయితీ విక్రయాలు ముగిసిన నేపథ్యంలో, రూ.86 కోట్ల విక్రయాలు జరిగాయని, గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.10 కోట్లు అదనపు విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

19 వాహనాల వేలం

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఎక్సైజ్ శాఖ వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 19వ తేది వేలం వేయనున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆర్.శ్రీనివాస పెరుమాళ్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లా సాయుధదళ మైదానంలో ఉదయం 10 గంటల కు 99 వాహనాలు వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనే వారు డిపాజిట్‌గా ద్విచక్రవాహనాలకు రూ.1,000, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.5,000 చెల్లించాలి. వేలంలో వాహనాలు పొందిన వారు ద్విచక్రవాహనాలకు 12 శాతం, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు 18 శాతం ప్రభుత్వ విక్రయ పన్నును వేలం మొత్తంతో పాటు వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల వివరాలు, వేలంలో నిర్ణయించిన కనిష్ఠ ధర తదితర వివరాలు ఎస్పీ కార్యాలయంలోని నోటీసు బోర్డు ద్వారా తెలుసుకోవచ్చని ఎస్పీ తెలిపారు.

క్షయ బాధితుల స్టైఫండ్ రూ.1,000కి పెంపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్షయ బాధితులకు అందిస్తున్న స్టైఫండ్ రూ.500 నుంచి రూ.1,000కి పెంచినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఆయన నగరంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నీలగిరి, తిరుచ్చి, తిరువారూరు, తూత్తుకుడి, తిరువణ్ణామలై, మదురై, కన్నియాకుమారి, కరూర్ తదితర జిల్లాలో క్షయరహిత జిల్లాలుగా కేంద్ర ప్రభుత్వ పురస్కారాలు పొందాయన్నారు. ప్రస్తుతం 2.55 లక్షల మంది క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించగా, వారిలో 84,666 మంది లక్షణాలున్నట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాధి నియంత్రించేలా ప్రభుత్వ పలు చర్యలు చేపట్టింది. క్షయరహిత తమిళనాడు రూపొందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం క్షయ బాధితులకు అందిస్తున్న నెలకు రూ.500 స్టైఫండ్‌ను ఈ నెల నుంచి రూ.1,000కి పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు.

క్షయవ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ



అవగాహన ప్రతిజ్ఞలో మంత్రులు సుబ్రమణ్యం, గాంధీ

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, చేనేత శాఖ మంత్రి గాంధీలు పాల్గొని, క్షయరహిత తమిళనాడును తీర్చిదిద్దేలా కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జాతీయ సంక్షేమ కమిటీ డైరెక్టర్ హర్షమంగళ, దేశీయ సంక్షేమ కమిటీ డైరెక్టర్ అరుణ్ ధర్మరాజ్, వ్యాధి నివారణ వైద్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయకం, అదనపు డైరెక్టర్ డా.ఆషాబేట్రిక్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించేలా కరపత్రాలు పంపిణీ చేశారు.

హస్త కళాకారులకు రాయితీపై రుణాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'కలైంజర్ హస్తకళల పథకం'లో భాగంగా హస్త కళాకారులకు సబ్సిడీతో రూ.3 లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి అన్బరసన్ తెలిపారు. హస్త కళాకారులకు ఉపాధి అవకాశాలు పెంచడం, వారిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా కలైంజర్ హస్తకళల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. కుటుంబ వ్యాపార ప్రాతిపదికన కాకుండా 25 హస్తకళలు, పరిశ్రమల్లో నిమగ్నమైన వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త వ్యాపారం ప్రారంభించడం, ఆధునికంగా విస్తరణకు రుణ సహాయాలు అందజేస్తోంది. ఆ ప్రకారం, రూ.50వేల నుంచి రూ.3 లక్షల వరకు 25 శాతం సబ్సిడీతో రుణాలు అందజేయనున్నారు. అలాగే, 5 శాతం వరకు వడ్డీలో రాయితీ కూడా ఉంటుంది. 35 ఏళ్ల కనీస వయసు కలగి చెక్క పని, శిల్పం, పూలు, నగల తయారీ, టైలరింగ్ సహా 25 రకాల పరిశ్రమలకు రుణాలు ఇస్తున్నారు. ఏటా 10వేల మందికి రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆసక్తిగల వారు www.msmeonline. tn.gov. in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హు లను జిల్లా పారిశ్రామిక కేంద్రాల జనరల్ మేనేజర్ల నేతృత్వంలోని కమిటీ ఎంపిక చేసి బ్యాంకులు రుణాలు అందించేందుకు సిఫారసు చేస్తుందని అధికారులు తెలిపారు.

కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు ఖైదీలకు ప్రత్యేక సదుపాయం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారాల్లో ఉన్న ఖైదీలు, తమ కుటుంబసభ్యులు, బంధువులతో కంప్యూటర్ స్ర్కీన్ ద్వారా వీడియో కాల్‌లో మాట్లాడే సదుపాయం పరిచయం చేశారు. పుళల్, వేలూరు, కోవై, తిరుచ్చి, పాళయంకోట సహా 9 ప్రాంతాల్లో కేంద్ర కారాగారాలున్నాయి. ఈ జైళ్లలోని ఖైదీలు కుటుంబ సభ్యులతో మాట్లాడాలంటే జైలు ప్రాంగణంలో ప్రత్యేక గది ఏర్పాటుచేశారు. ఈ గదిలో 15 మంది ఖైదీలు మాట్లాడే సైకర్యాం ఉంది. ఈ నేపథ్యంలో, ఖైదీలో కుటుంబ సభ్యులతో మాట్లాడే సదుపాయం కల్పించిన జైళ్ల శాఖ, 126 కంప్యూటర్లను ఈ జైళ్లకు అందజేసింది. ఖైదీలు మూడు రోజులకు ఒకసారి కుటుంబ సభ్యులతో 12 నిమిషాలు వీడియో కాల్ ద్వారా మాట్లాడవచ్చు. అందుకు నిమిషానికి రూ.2.25 ఛార్జీ వసూలుచేయనున్నారు. ఈ విషయమై జైళ్ల శాఖ అధికారులు మాట్లాడుతూ.. కరోనా కాలంలో, ఖైదీలు తమ కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు స్మార్ట్ ఫోన్లు వినియోగించామని, ప్రస్తుతం కంప్యూటర్ మానిటర్ ద్వారా వీడియో కాల్ మాట్లాడే వసతి కల్పించినట్లు తెలిపారు.

రామేశ్వరం సముద్రంలోకి 10.50 కోట్ల రొయ్యపిల్లలు



రొయ్య పిల్లలు వదులుతున్న సిబ్బంది

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సముద్రంలో కేంద్ర మత్స్య పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు 10.50 కోట్ల గ్రీన్ లైన్ రొయ్య పిల్లలు వదిలిపెట్టారు. రామేశ్వరం సమీపం మండపంలోని కేంద్ర సముద్రపు చేపల పరిశోధన సంస్థ ప్రధాన మంత్రి చేపల అభివృద్ధి పథకంలో గ్రీన్ లైన్ రొయ్య పిల్లలు ఉత్పత్తి చేసి, వాటిని మన్నార్‌వలైకుడ, పాక్ జలసంధి సముద్రంలో వదులుతుంటారు. ఈ నేపథ్యంలో, కేంద్రం అధికారి వినోద్ నేతృత్వంలో మన్నార్‌వలైకుడ సముద్రంలో 21 లక్షల రొయ్య పిల్లలను వదిలిపెట్టారు. ఈ రొయ్యలు జాలర్ల వలలో చిక్కితే వారికి మంచి ఆదాయం కలుగుతుంది. జాలర్ల ఆర్థిక స్థితి మెరుగుపరిచేలా 2022 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 10.50 కోట్ల రొయ్యపిల్లలు సముద్రంలో వదిలినట్లు అధికారులు తెలిపారు.

బెయిల్‌పై వచ్చి మీలో ఎవరూ మంత్రి కాలేదా?

● బీజేపీని ప్రశ్నించిన సెంథిల్ బాలాజి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి సెంథిల్ బాలాజి

ప్యారీస్, డిసెంబర్ 8, (ఆంధ్రజ్యోతి): బీజేపీలో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చి ఎవరు మంత్రి కాలేదా అని విద్యుత్ శాఖా మంత్రి సెంథిల్ బాలాజి ప్రశ్నించారు. కరూర్ నియోజకవర్గంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రజల నుంచి వానతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరూర్ కార్పొరేషన్‌లో గత మూడేళ్లలో రూ.476 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పనులు, రూ.113 కోట్లతో కొత్త కావేరి తాగునీటి పథకాలను అమలు పరిచినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్నడూ వాద్యుత్ బోర్డుకు సంబంధించి వివాదాల్లో చిక్కుకున్న ఆదానీని సంప్రదించలేదని దీనిపై తాను ఇదివరకే సమగ్ర నివేదిక విడుదల చేశానని అయినా, సీఎం పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే రీతిలో బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీలో ఎవరూ బెయిల్‌పై వచ్చి మంత్రులు కాలేదా అని బాలాజీ ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిర్వహనలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కరూర్ జిల్లా కలెక్టర్ తంగవేలు, ఎస్పీ ఫిరోజ్ ఖాన్, ఎమ్మెల్యేలు, ఇలంగో, శివకామ సుందరి, మేయర్ కవిత, డిప్యూటీ మేయర్ సర్వానన్‌తో సహా తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో మదురై ఎయిమ్స్ పూర్తి

ప్యారీస్, డిసెంబర్ 8, (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణం పనులను మూడేళ్లలో పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు మదురై ఎయిమ్స్ కేంద్ర ప్రజా సమాచార కేంద్ర అధికారి తెలియజేశారు. ఎయిమ్స్ నిర్మాణం పనులపై వివరాలు కోరుతూ తెన్‌కాశి జిల్లా పావూర్ సత్రానికి చెందిన సంఘ సేవకుడు పాండ్యరాజ వినతి పత్రం సమర్పించారు. ఇందుకు ఆర్టీఐ కార్యాలయం తెలియజేసిన సమాధానంపై పాండ్యరాజ ఆదివారం మీడియాతో మాట్లాడారు. వైద్య విద్యా కళాశాల, నర్సింగ్ కళాశాల, విద్యార్థి, విద్యార్థుల హాస్టల్, డైనింగ్ హాల్, అవుట్ పేషెంట్ బ్లాక్, ప్రొఫెసర్ల క్వార్టర్స్, క్యాంటీన్లు, ప్లేగ్రౌండ్, ఇతర సేవా విభాగాలకు చెందిన భవన నిర్మాణం పనులకు సంబంధించి ఎల్‌అండ్‌టీ సంస్థతో రూ.2,021.51 కోట్లకు కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మే 22 నుంచి ప్రారంభించిన పనులను రాబోయే 33 నెలలో పూర్తి చేసేలా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పనులన్నీ 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆర్టీఐ సమాచారంలో తెలిసిందన్నారు. 2015 ఫిబ్రవరిలో మదురై ఎయిమ్స్ ప్రకటన విడుదలైందని, 2019 జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారని, దాదాపు 8 ఏళ్లు గడిచినా మదురై ఎయిమ్స్ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో కాదు... క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాం...!

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కాదని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ అన్నారు. తిరుచ్చి సమీపం తిరువెరుంబూర్‌లో ఆదివారం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అన్బిల్ మహేష్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షం, వరదలతో నష్టపోయిన ప్రాంతాలను సందర్శించి పబ్లిసిటీ కోసం ఫొటోలు దిగుతున్నామని విజయ్ ఇటీవల ప్రస్తావించారన్నారు. క్షేత్రస్థాయిలో ఎవరు పనిచేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. సోషల్ మీడియాలో కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తే ప్రజల కష్టాలు ఏమిటో తెలుస్తాయన్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజుల్లో 2,500 కి.మీ ప్రయాణించి అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకొని, సత్వరం అవి పరిష్కరించేలా అధికారులను ఆదేశించారని తెలిపారు. మేం ఎప్పుడూ ప్రజలతోనే ఉంటామని, మా వెంట ప్రజలు ఉన్నారని తెలిపారు.

తుఫాను బాధితులకు డీపీఐ విరాళం రూ.10లక్షలు

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫెంగల్ తుఫాన్ బాధిత జిల్లాలను ఆదుకునేందుకుగాను డీపీఐ తరఫున రూ.10లక్షల విరాళంగా ఇస్తున్నట్లు ఆ పార్టీ నేత, ఎంపీ తొల్ తిరుమావళవన్ ప్రకటించారు.

గాయపడిన వ్యక్తిని రక్షించిన ఎమ్మెల్యే



ఘటనా స్థలంలో ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఎమ్మెల్యే రక్షించి ఆస్పత్రికి తరలించారు. తిరుత్తణి యూనియన్‌లోని ముస్లిం నగర్‌కు చెందిన సికిందర్ శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరుత్తణి బజార్‌కు వస్తున్నాడు. చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సికిందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో అటు వైపు వస్తున్న ఎమ్మెల్యే చంద్రన్ ప్రమాదాన్ని చూసి కారు ఆపి క్షతగాత్రుడ్ని తన కారులో ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అంబులెన్స్ రావడంతో, సికిందర్‌ను అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి అతడిని పరామర్శించి, వైద్యులనడిగి అతని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

సైన్స్ ఇయక్కం ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్ట్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రతినిధులు అముద, జనార్ధనన్

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ ఇయక్కం ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు మొత్తం 247 మంది పాల్గొన్నారు. జిల్లాలోని 9 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలను ఇయక్కం అధ్యక్షులు అముద, జాయింట్ సెక్రటరీ కోటీశ్వరి, సెక్రటరీ జనార్ధనన్, ఉపాధ్యక్షుడు విశ్వనాథన్ తదితరులు పర్యవేక్షించారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేయగా, అధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు షీల్డులు బహూకరించారు.

ఉత్తరం రాయడంపై పోటీలు



ఉత్తరం రాస్తున్న విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో ఉత్తరాల ప్రాధాన్యత తెలిపేలా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఉత్తరం రాసే పోటీలు నిర్వహించారు. తేని జిల్లా కూడలూరు ఎస్ఎస్‌కేబీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. తపాలా శాఖ తేని డివిజనల్ మేనేజర్ కుమరన్ నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్తరం రాసేలా 'ఇన్‌ల్యాండ్ లెటర్' అందజేశారు. రాసిన ఉత్తరాలను చెన్నై తపాలా శాఖ ప్రధాన కార్యాలయానికి పంపనున్నట్లు, ఉత్తరాలు పరిశీలించి ముగ్గురు విజేతలను ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని మేనేజర్ కుమరన్ తెలిపారు.

114 సార్లు రక్తదానం చేసిన దినకరన్‌కు ప్రశంస



దినకరన్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) నలమ్ దీపాలయ ట్రస్ట్ తరఫున ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 114 సార్లు రక్తదానం చేసిన దినకరన్‌కు పురస్కారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సీఎంసీ వైద్యులు జాయ్‌జాన్ మేనన్, అబయ అబ్రహం సంయుక్తంగా దినకరన్‌ను అభినందించి పురస్కారం ప్రదానం చేశారు.

1.54 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1.54 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు అందించేందుకు పౌరసరఫరాల శాఖకు రాష్ట్రప్రభుత్వ ఈ-గవర్నెన్స్ ఏజెన్సీ అంగీకారం తెలిపింది. కొత్త రేషన్‌కార్డులు పొందగోరు వారు పౌరసరఫరాల శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలించి కొత్త కార్డులకు అనుమతిస్తుంటారు. ఒకే కుటుంబంలో నివసిస్తున్న పలువురు, వేర్వేరుగా ఉంటున్నట్లు దరఖాస్తు చేసుకుంటున్నారని ఫిర్యాదులందాయి. దీంతో దరఖాస్తులను సక్రమంగా విచారించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. దరఖాస్తుదారుల పేరు, తల్లిదండ్రుల రేషన్‌కార్డులో ఉందా, వేరుగా నివసిస్తున్నందుకు తగిన పత్రాలు సమర్పించారా అనే వివరాలను ఈ-గవర్నెన్స్ ఏజెన్సీ చేపట్టింది. ఆ ప్రకారంనాలుగు నెలల్లో కొత్త రేషన్ కార్డు కోసం అందిన 2.84 లక్షల దరఖాస్తులు పరిశీలించి, వాటిలో 1.54 లక్షల మందికి కార్డులిచ్చేందుకు తెలిపింది. కార్డులు అందించే పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.3 కోట్ల విలువైన అంబర్‌గ్రీస్ పట్టివేత

ఐసిఎఫ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో రూ.3 కోట్ల విలువైన అంబర్ గ్రీస్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు... వీకే పురం ప్రాంతంలోని అగస్త్యర్‌పట్టి స్టేట్ బ్యాంక్ కాలనీలో ఓ ఇంట్లో 2.7 కిలోల అంబర్ గ్రీస్ విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టి అంబర్ గ్రీస్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అదే ప్రాంతానికి చెందిన సెల్వం, శబరిదాసన్, పరమశివంలను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న అంబర్ గ్రీస్ బహిరంగ మార్కెట్లో రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఎనిమిది మంది రాష్ట్ర జాలర్ల అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెడుదీవి సమీపంలో చేపలు పడుతున్న 8 మంది రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. రామేశ్వరం సమీపం మండపం ఫిషింగ్ హార్బర్ నుంచి శనివారం 324 ఫైబర్ పడవల్లో సుమారు 1,600 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లారు. ఆదివారం వేకువజామున కార్తీక్ రాజా, సహాయ్ ఆంధ్రూస్‌లకు చెందిన పడవలో జాలర్లు చేపలు పడుతుండగా శ్రీలంక నావికాదళం వారిని చుట్టుముట్టింది. సరిహద్దులు దాటారంటూ పడవల్లోని కన్నన్, కాళి, ముత్తురాజ్, యాసిన్, శేషు, రామకృష్ణన్, వేలు తదితర 8 మందిని అరెస్ట్ చేసి కాంగేశన్ హార్బర్‌కు తరలించి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 69 రాష్ట్ర జాలర్లకు చెందిన పడవలు స్వాధీనం చేసుకోవడంతో పాటు 537 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది.

ప్రైవేటు బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ ప్రాంతంలో ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో సైకిల్‌పై వెళుతున్న ప్లస్ టూ విద్యార్థిని మృతిచెందగా, మరో విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. బీసెంట్ అవెన్యూ రోడ్డు శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ప్లస్ టూ విద్యార్థిని మంజుల మృతిచెందగా, సైకిల్ వెనుక కూర్చున్న దీప్తియాకు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అడయార్ ట్రాఫిక్ పోలీసులు, దీప్తియాను చికిత్స నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి బస్సు స్వాధీనం చేసుకొని, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ సస్పెన్షన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ జహంగీర్ భాషాను సస్పెండ్ చేస్తూ నగరాభివృద్ధి సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఊటీ మున్సిపల్ కమిషనర్‌గా వ్యవహరించిన జహంగీర్ భాషా నుంచి ఏసీబీ అధికారులు లక్షల్లో నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యలతో ఆయన వీఆర్‌కు బదిలీ అయ్యారు. అనంతరం కొద్దిరోజుల్లో జహంగీర్ భాషా తిరునల్వేలి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ నియామకంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో, జహంగీర్ భాషాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పిల్లలను బావిలోకి తోసి మహిళ ఆత్మహత్య

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి హతమార్చిన మహిళ తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. వెప్పూర్ సమీపం మానిగైపురమేడు ప్రాంతానికి చెందిన ఎలక్ట్రీషియన్ అళగప్పన్‌కు ఏడేళ్ల క్రితం చెన్నైకి చెందిన నిత్యతో వివాహమై, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తుతున్నట్లు సమాచారం. శనివారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వాగ్వివాదం చెలరేగింది. దీంతో ఆవేశం చెందిన నిత్య, తన ఇద్దరు పిల్లలను తీసుకొని, శివారు ప్రాంతంలోని బావి వద్దకు వెళ్లి, పిల్లలను బావిలో తోసి, తాను దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బావి నుంచి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి భర్త అళగప్పన్‌ను విచారిస్తున్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం



పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపం మండపం తీరానికి తాబేలు కళేబరం కొట్టుకొచ్చింది. రామేశ్వరం పాక్ జలసంధి, ధనుష్కోటి మన్నార్ వళైకుడ సముద్రంలో లాగర్‌హెడ్, గ్రీన్ సహా పలురకాల తాబేళ్లు నివసిస్తుంటాయి. ఈ తాబేళ్లు డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు తీరప్రాంతాలకు చేరుకొని ఇసుకలో గుంతలు తవ్వి గుడ్లు పెట్టి తిరిగి వెళుతుంటాయి. ఇటీవల కాలంలో మృతిచెంది తీరానికి కొట్టుకొస్తున్న తాబేళ్ల సంఖ్య పెరుగుతోంది. శనివారం మండపం తీరప్రాంతానికి తాబేలు కళేబరం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని కళేబరాన్ని పరిశీలించారు. తీరానికి వస్తుండగా పడవ, రాళ్ల పారలు, నిషేధిత జాలర్ల వలలో చిక్కుకొని తాబేలు మృతిచెంది ఉంటుందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం వెటర్నరీ వైద్యులు తాబేలు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే ఇసుకలో పాతిపెట్టారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాషర్‌మెన్‌పేటలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వాషర్‌మెన్‌పేట సీఐకి అందిన సమాచారంతో శనివారం రాత్రి ప్రత్యేక పోలీసు బృందం మూలకొత్తళం శ్మశానవాటిక సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యాసర్పాడి టీటీ బ్లాక్ హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన రయాజ్ అహ్మదుల్లా, సెవెన్‌వెల్స్ పోర్చుగీస్ చర్చి రోడ్డుకు చెందిన మహ్మద్ రియాజ్, మూలకొత్తళం పీపీ అమ్మన్ ఆలయ వీధికి చెందిన విఘ్నేశ్వరన్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి 20 నైట్రాజెపామ్ మాత్రలు, 10 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, 4 సిమ్ కార్డులు, 2 పెన్ డ్రైవ్‌లు, రూ.31వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈబీ అధికారి ఆత్మహత్య

ఐసిఎఫ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బోర్డు అధికారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో కలకలం రేపింది. కన్నియాకుమారి జిల్లా తిరుపతినగర్‌కు చెందిన వల్లివేల్ (59) విద్యుత్ బోర్డులో అధికారిగా పనిచేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా నగరానికి బదిలీ అయిన ఆయన భార్య సంధ్యతో కలసి పాడి గోల్డన్ కాలనీలో నివసిస్తున్నాడు. ఇటీవల కురిసిన ఫెంగల్ తుఫాన్ కారణంగా భార్యాభర్తలు, ఆవడిలో ఉంటున్న తమ కుమార్తె ఇంటికి వెళ్లారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం వల్లివేల్ పాడి ఇంటికి రాగా, శనివారం ఉదయం వరకు ఆయన సెల్‌ఫోన్ స్విచ్చాప్‌లో ఉండడం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వారు వెంటనే ఇంటికి వచ్చి చూడగా, ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకొని మృతిచెందిన స్థితిలో ఉన్న వల్లివేల్‌ను గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న కొరట్టూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు సంబంధించిన ప్రాథమిక విచారణలో... కన్నియాకుమారి నుంచి నగరానికి బదిలీ కావడంతో ఆయన మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

ఒకే కుటుంబంలో నలుగురి ఆత్మహత్యాయత్నం

ఐసిఎఫ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తంజావూరు జిల్లాలో జరిగింది. కుంభకోణం నాథన్ నగర్‌కు చెందిన సరస్వతి (66) పెద్దకుమారుడు శంకరలింగం (35), ఆయన భార్య ప్రమీల (29), చిన్న కుమారుడు రాజ్‌కుమార్ (29)తో కలసి ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కుటుంబ అవసరాలకు అన్నదమ్ములు పలువురి వద్ద రూ.4 లక్షల వరకు అధిక వడ్డీకి అప్పులు తీసుకున్నట్లు సమాచారం. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీంతో, అప్పుల బాధ తట్టుకోలేని సరస్వతి సహా నలుగురు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల వారు వారిని వెంటనే సమీపంలోని కుంభకోణం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

గుంతలో పడి ఆరేళ్ల బాలుడి మృతి

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ పెరుంబుదూర్‌లో కర్మాగారం నిర్మాణం కోసం స్తంభాల కోసం తీసిన గుంతలో పడి ఆరేళ్ల బాలుడు మృతిచెందాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన ముఖేష్-లలితకుమారి దంపతులకు అభినేకుమార్ (6) సహా ఇద్దరు పిల్లలున్నారు. వీరు కూలీలుగా పనిచేస్తున్నారు. శ్రీపెరుంబుదూర్ సమీపం పాలనల్లూర్‌లో కొత్తగా కర్మాగారం నిర్మాణం కోసం పిల్లర్ల ఏర్పాటుకు తీసిన గుంతల్లో ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరింది. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి అభినేకుమార్ ఆ ప్రాంతంలో ఆడుకుంటూ ఆ గుంతలో పడి మృతిచెందాడు. కుమారుడి కోసం గాలించిన తల్లిదండ్రులు, గుంతలో అతని మృతదేహం కనపడడంతో బోరున విలపించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'విడాముయర్చి'లో అజిత్ డబ్బింగ్ పూర్తి

అగ్రనటుడు అజిత్ కుమార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి'. షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో మూవీలో తన పాత్రకు హీరో అజిత్ డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ విషయాన్ని ఆయన మేనేజర్ సురేష్ చంద్ర శనివారం ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. అలాగే, టెక్నీషియన్లతో కలిసి అజిత్ డబ్బింగ్ స్టూడియోలో ఉన్న ఫొటో రిలీజ్ చేశారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేసేలా ప్లాన్ చేశారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందగా ఇందులో అజిత్ సరసన త్రిష, అగ్రనటుడు అర్జున్ తదితరులు నటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ పతాకంపై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ సింహభాగం అజర్‌బైజాన్‌లో పూర్తిచేశారు. ఇప్పటికే టీజర్ విడుదల చేయగా, 1977లో విడుదలై ఘన విజయం సాధించిన 'బ్రేక్‌డౌన్' మూవీ చాయలు ఇందులోని సన్నివేశాలు కనిపిస్తున్నాయి.


డబ్బింగ్ స్టూడియోలో అజిత్ కుమార్ తదితరులు



ప్రత్యేక గీతంలో శ్రియ!

ఒకప్పుడు తెలుగులో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన హీరోయిన్ శ్రియ ఇపుడు సినిమా అవకాశాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో తనకు వచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని ఆమె వదులుకోవడం లేదు. ఇందులో భాగంగానే 'సూర్య-44'లో ప్రత్యేక గీతం (ఐటమ్ సాంగ్)లో నటించారు. ఈ విషయాన్ని ఆమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, 'నేను 'సూర్య-44' మూవీలో ప్రత్యేక గీతంలో ఆడిపాడాను. ఈ పాటకు సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు. ఈయన పుట్టిన రోజును పురస్కరించుకుని డిసెంబరులో విడుదల చేయాలని భావిస్తున్నారు' అని తెలిపారు. కాగా, 2డీ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. పూజా హెగ్డే హీరోయిన్, జోజు జార్జ్, కరుణాకరన్, జయరామ్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ప్రేమ కథా చిత్రమైనప్పటికీ ఇందులో యాక్షన్ సన్నివేశాలు కూడా అధికంగా ఉన్నట్టు సమాచారం. కాగా, శ్రియ వివాహం చేసుకుని ఓ బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెల్సిందే.

ఆ నిర్మాత కోసం సూర్య!

కోలీవుడ్‌లో బడా నిర్మాతైన స్టూడియో గ్రీన్ అధినేత నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజాను ఆదుకునేందుకు హీరో సూర్య మరోసారి పెద్ద మనసుతో ముందుకు వచ్చారు. గతంలో కూడా ఈ నిర్మాత కష్టాల్లో ఉన్న సమయంలో సూర్య ఆదుకున్న విషయం తెల్సిందే. ఇపుడు జ్ఞానవేల్ రాజా మరోమారు ఆర్థిక కష్టాల్లో కూరుకున్నారు. సూర్య హీరోగా, చిరుత్తై శివ దర్శకత్వంలో వచ్చిన 'కంగువా' చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తాపడింది. దీంతో నిర్మాత జ్ఞానవేల్ రాజాతో పాటు పంపిణీదారులు భారీ నష్టాలను చవిచూశారు. ఈ సినిమా తొలి ఆట నుంచే వచ్చిన నెగటివ్ రివ్యూలు కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపించాయి. దీంతో నిర్మాతకు భారీ నష్టం వాటిల్లింది. ఇటీవలి కాలంలో జ్ఞానవేల్ రాజా భారీగా నష్టపోవడం ఇదేనని ఫిల్మ్ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో తన నిర్మాతను ఆదుకునేందుకు హీరో సూర్య ముందుకు వచ్చారు. స్టూడియో గ్రీన్ బ్యానరులో మరో చిత్రంలో నటించేందుకు సమ్మతించారు. ఇందుకోసం సరైన కథాన్వేషణలో సంబంధిత వర్గాలు నిమగ్నమై వున్నాయి. ప్రస్తుతం సూర్య నటిస్తున్న చిత్రాన్ని పూర్తి చేశాక జ్ఞానవేల్ నిర్మించే చిత్రంలో నటించనున్నారు. ఈ సినిమాకు దర్శకుడు, ఇందులో నటించే నటీనటులు ఎవరన్నది త్వరలోనే తెలియనుంది.


సూర్య - జ్ఞానవేల్ రాజా

చిత్రజ్యోతి

9న 'వీర ధీర శూరన్' మూవీ టీజర్


'వీర ధీర శూరన్'లో విక్రమ్

'చియాన్' విక్రమ్ కథానాయకుడుగా నటించిన "వీర ధీర శూరన్' సినిమా టీజర్ సోమవారం (9వ తేదీ) విడుదల చేయనున్నారు. 'సిత్తా' వంటి సూపర్‌హిట్ మూవీ తర్వాత డైరెక్టర్ అరుణ్ కుమార్, 'తంగలాన్' తర్వాత విక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దుషార విజయన్ హీరోయిన్. ఎస్‌జే సూర్య, మలయాళ నటుడు సూరజ్ వంటి భారీ తారాగణం ఇందులో నటించారు. శిబు తమీన్స్ నిర్మించిన ఈ సినిమా షూటింగ్ మదురై, పరిసర ప్రాంతాల్లో జరిపారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసి తొలి భాగాన్ని సంక్రాంతికి విడుదల చేయాలన్న పట్టుదలతో చిత్రబృందం ఉంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. ఇప్పటికే ఈ సినిమా పంపిణీ హక్కులను ఫైవ్‌స్టార్ సెంథిల్ సంస్థ భారీ ధరకు కొనుగోలు చేసింది. ఈయన గతంలో 'గరుడన్', 'మహారాజ' వంటి హిట్ చిత్రాలను పంపిణీ చేశారు. విదేశీ హక్కులను మాత్రం పార్స్ ఫిలిమ్స్ సొంతం చేసుకుంది.

జీవిత ఖైదీ.. ఆవిష్కరణలో మేటి

● సోలార్ పవర్‌తో నడిచే ఆటో ● కోవై సెంట్రల్ జైలు అధికారుల ప్రశంసలు


యుగ ఆదిత్తన్ తయారు చేసిన సోలార్ సైకిల్



చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సెంట్రల్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ సోలార్ పవర్‌తో పనిచేసే ఆటో, సైకిళ్లను రూపొందించి జైలు ఉన్నతాధికారుల ప్రశంసలందుకున్నారు. ఈరోడ్ జిల్లా గౌతంబాడికి చెందిన యుగ ఆదిత్తన్ (32) అనే ఏరోనాటికల్ ఇంజనీర్ ఓ హత్య కేసులో అరెస్టయి కోవై సెంట్రల్ జైలులో గత ఏడేళ్లుగా యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. సెంట్రల్ జైలు వర్క్‌షాపులో పని చేస్తున్న యుగ ఆదిత్తన్ పనికిరావని పడేసిన వస్తువులతో ఉపయోపడే ఎన్నో వస్తువులను తయారు చేస్తున్నాడు. కొద్ది నెలలకు ముందు సోలార్ విద్యుత్‌తో నడిచే సైకిళ్లను తయారు చేశాడు. ఆ సైకిళ్ల పనితీరును చూసి జైలు అధికారులు అతడిని మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సోలార్‌తో పనిచేసే ఆటో తయారు చేశాడు. ఈ విషయమై జైలు డీఐజీ షణ్ముగసుందరం మాట్లాడుతూ ఖైదీ యుగ ఆదిత్తన్ రూపొందించి సోలార్ ఆటోపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేశాడని, ఆ ఆటోలో డ్రైవర్ సీటు కింద బ్యాటరీ కూడా ఉందన్నారు. ఒకసారి ఛార్జి చేసుకుంటూ 200 కి.మీల వరకూ నడపవచ్చని తెలిపారు. ఎల్‌ఈడీ లైట్లు, హారన్, హ్యాండ్ బ్రేక్, టేప్ రికార్డర్ సదుపాయాలు కూడా ఉన్నాయని చెప్పారు. రూ.1.25లక్షల ఖర్చుతో తయారైన ఈ ఆటోను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా జైలు ప్రాంగణాల్లోనే నడుపుతున్నామని, త్వరలో జైలులో ఉన్న ఖైదీలను చూడటానికి వచ్చే బంధువులు, వృద్ధులకోసం ఈ ఆటోను ఉపయోగించనున్నామని ఆయన వివరించారు.

యుగ ఆదిత్తన్ రూపొందించిన సోలార్ పవర్ ఆటో నడుపుతున్న కోవై సెంట్రల్ జైలు అధికారి


● తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవం

రేపటి నుంచి 16 వరకు పాఠశాలలకు సెలవు

● కలెక్టర్ భాస్కర పాండియన్

ప్యారీస్, డిసెంబర్ 8, (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలోని అన్నామలయార్ ఆలయంలో ఈ నెల 1వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమైన కార్తికదీపోత్సవం కోలాహలంగా జరుగుతోంది. ప్రధానాంశమైన మహా రథోత్సవం ఈ నెల 10, 13వ తేదీ తెల్లవారు జామున భరణీ దీపం, సాయంత్రం ఆరు గంటలకు అరుణాచల కొండ శిఖరంపై మహాదీపం వెలిగించనున్నారు. ఈ కార్తిక దీపోత్సవానికి ఎలాంటి అంతరాయం లేకుండా సుమారు 14 వేల మందికి పైగా పోలీసులు భద్రతా విధులలో పాల్గొంటున్నారు. వీరికి ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, ప్రవేటు పాఠశాలలో విడిది కల్పించింది. ఇందు వల్ల మంగళవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఎనిమిది రోజులు తిరువణ్ణామలై నగర పరాధిలో ఉన్న 1546 పాఠశాలలకు కలెక్టర్ భాస్కర పాండియన్ సెలవు ప్రకటించారు.


వెండి కల్పవృక్ష వాహనంలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు

వెండి కామధేను వాహనంలో పరాశక్తి అమ్మవారు - వెండి నెమలి వాహనంలో సుబ్రమణ్యస్వామి - వెండి మూషిక వాహనంలో వినాయకుడు

కల్పవృక్ష వాహనంపై

అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవార్ల విహారం

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై ఆలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు పలు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో నాలుగో రోజైన శనివారం రాత్రి అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు వెండి కల్పవృక్ష వాహనంలో, పరాశక్తి అమ్మవారు వెండి కామదేను వాహనం, నెమలి వాహనంలో వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, వెండి మూషికా వాహనంలో వినాయకుడు, వెండి వృషభ వాహనంలో చండీకేశ్వరుడు ప్రత్యేక అలంకరణలో, విశేషంగా అలంకరించిన వాహనాల్లో విహరించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని ఉత్సవ మూర్తులను దర్శించి పరవశించారు.


ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న శివాచార్యులు



విస్తృతంగా పెట్టుబడి అవకాశాలు

ప్యారీస్, డిసెంబర్ 8, (ఆంధ్రజ్యోతి): ఫార్మా, ఆటో, టెలికామ్, ఐటీ, ప్రవేట్ బ్యాంకింగ్ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలు నిండుగా ఉన్నాయని కోటక్ మహీంద్ర ఏఎంసీ ఎండీ నీలేశ్ షా పేర్కొన్నా రు. కేఎంఏఎంసీ ఆధ్వర్యంలో అవుట్ లుక్ రిపోర్ట్- 2025 పేరిట నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీలేశ్ షా పాల్గొని రాబోయే సంవత్సరంలో పెట్టుబడిదారులకు పెట్టుబడుల అవకాశాలను, భారత ఆర్థిక వ్యవస్థ, మూలధన మార్కెట్‌లో అవకాశాలు తదితర అంశాలను వివరించారు. దేశంలో పెరిగిన ప్రభుత్వ వ్యయం, బలమైన వినియోగ దోరనలు ఆశావాదానికి ఆజ్యం పోస్తున్నప్పటికి, ప్రవేటు బ్యాంకులు, ఫార్మా, ఆటో, టెలికామ్, ఐటీ, తదితర రంగాలలో పెట్టుబడి విలువ అవకాశాలు అధికంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

అవుట్‌లుక్ కార్యక్రమంలో కోటక్ మహీంద్ర ఏఎంసీ ఎండీ నీలేశ్ షా తదితరులు


దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

తిరుచెందూర్ ఆలయంలో భక్తుల రద్దీ

ప్యారీస్, డిసెంబర్ 8, (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులో ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలో సుబ్రహ్మణ్యస్వామి వారి ఆరు ప్రధాన క్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూర్ క్షేత్రాన్ని ప్రతిరోజు వేలాది మంది భక్తులు సందర్శించి వల్లీ, దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్య స్వామి వారిని భక్తి శ్రద్ధలతో సేవిస్తుంటారు. ముఖ్యంగా పండుగ రోజులు, ప్రభుత్వ సెలవు రోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతుంటారు. ఆ రీతిలో ఆదివారం ఈ ఆలయం, సముద్ర తీరం, నాళిబావి, వల్లి గుహ తదితర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉచిత దర్శనం, రూ.100 దర్శనం, సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లలో సుమారుగా నాలుగు గంటలపాటు వేచి ఉండి స్వామి దర్శనం చేసుకున్నారు.

తైవాన్ యువతి.. కోవై ఇంజనీర్

● పెద్దల సమక్షంలో ఒక్కటైన జంట

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు పెరియనాయకన్‌పాళయం సమీపం సామిశెట్టిపాళయం ప్రాంతానికి చెందిన యువకుడు తైవాన్ యువతిని ప్రేమించి హిందూ మత సంప్రదాయ రీతిలో వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమ పెళ్ళికి ఇరువైపు కుటుంబీకులు పచ్చజెండా ఊపటమే గాకుండా మేట్టుపాళయం రోడ్డు లక్ష్మీ కల్యాణ మండపంలో అట్టహాసంగా పెళ్ళి రిసెప్షన్ నిర్వహించారు. సామిశెట్టిపాళయంకు చెందిన సుబ్రమణ్యం, విజయలక్ష్మి దంపతుల కుమారుడు కేఎస్ వైష్ణవరాజ్ పర్యావరణ భద్రతా విభాగం ఇంజనీర్‌గా తైవాన్‌లో పనిచేస్తున్నాడు. ఆ సందర్భంగా తైవాన్‌లో టీచర్‌గా పనిచేస్తున్న గ్లాడియా చాంగ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగామారింది. ఈ విషయం తెలుసుకున్న ఇరువైపు కుటుంబీకులు వారి పెళ్ళికి అంగీకరించారు. దీంతో వధువు తరఫు బంధువులంతా కోయంబత్తూరుకు విచ్చేసి వారి పెళ్ళికి చట్ట ప్రకారం చేపట్టాల్సినవన్నీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఇరువైపు కుటుంబీకులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో తమిళ సంప్రదాయ పద్ధతిలో ఆ ప్రేమ జంట వివాహం అత్యంత వైభవంగా జరిగింది. మేట్టుపాళయం రోడ్డులో పెళ్ళి రిసెప్షన్ వేడుకలు అట్టహాసంగా జరిపారు.


వరుడు వైష్ణవరాజ్ వేలికి ఉంగరం తొడుగుతున్న వధువు గ్లాడియా చాంగ్

త్రివేణి సంగమంలో అయ్యప్ప భక్తుల సందడి

చెన్నై, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక స్థలం కన్నియాకుమారిలో ఆదివారం వివిధ నగరాల నుండి వచ్చిన అయ్యప్ప భక్తులు సందడి చేశారు. ప్రతి యేటా నవంబర్, డిసెంబరు, జనవరి మాసాల్లో ఈ ప్రాంతానికి అత్యధిక సంఖ్యలో పర్యాటకులు, అయ్యప్ప భక్తులు వస్తుంటారు. ఈ యేడాది శబరిమల సీజన్ నవంబర్ 16న ప్రారంభమైంది. దీంతో కన్నియాకుమారికి వచ్చే పర్యాటకులు, అయ్యప్పభక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలు సెలవులు కావటంతో కన్నియాకుమారి సముద్రతీరం అందాలు తిలకించేందుకు వేల సంఖ్యలో అయ్యప్ప భక్తులు వచ్చారు. కన్నియాకుమారి వద్ద త్రివేణి సంగమ ప్రాంతంలో ఆదివారం ఉదయం సూర్యోదయాన్ని వీక్షించడానికి పర్యాటకులు, అయ్యప్ప భక్తులు పోటీపడ్డారు. సూర్యోదయ దృశ్యం తిలకించిన అనంతరం వీరంతా భగవతి అమ్మన్ ఆలయం, టీటీడీ ఆధ్వర్యంలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించడానికి బారులు తీరారు.ఉదయం ఎనిమిది గంటలకు బోట్‌హౌస్ వద్ద పడవల సవారీ కూడా ప్రారంభం కావటంతో పడవలో వివేకానంద స్మారకమండపం, తిరువళ్లువర్ విగ్రహ ప్రాంతాన్ని సందర్శించడానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో గుమికూడారు.ఇదే విధంగా గాంధీ స్మారక మండపం,కామరాజర్ స్మారక మండటపం సునామీ సంస్మరణ ఉద్యానవనం, సముద్రతీరంలోని పట్టణ పంచాయతీ పార్కు, సన్‌సెట్ పాయింట్ సముద్రతీరం,మ్యూజియం తదితర ప్రాంతాల్లోనూ ఉదయం నుండే పర్యాటకుల రాకపోకలు అధికమయ్యాయి.


త్రివేణి సంగమం వద్ద సూర్యోదయం వేళలో అయ్యప్ప భక్తులు



పురస్కారం అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

నారాయణి ఆస్పత్రి డెరెక్టర్‌కు పురస్కారం

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణి ఆస్పత్రి, పరిశోధన కేంద్రం డైరెక్టర్ బాలాజీకి పురస్కారం లభించింది. ప్రపంచ హ్యూమన్ రైట్స్, లీడర్‌షిప్ కాంగ్రెస్ తరఫున '20924 లీడర్ షిప్' అవార్డులు బాలాజీకి ప్రదానం చేశారు. రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నందుకు ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


విజేతలతో వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, నిర్వాహకులు

తిరుక్కురల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

వేలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేలూరు సాంకేతిక విశ్వవిద్యాలయం, కాట్పాడి సాంకేతిక విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరుక్కురల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వేలూరు, తిరుపత్తూర్, కృష్ణగిరి, ధర్మపురి, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువణ్ణామలై సహా పలు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో శంకర్, రమణి, కాదంబరి తొలి మూడు స్థానాల్లో నిలువగా, రూ.7,500, రూ.5,000, రూ.2,000 బహుమతులు అందజేశారు. అలాగే, పోటీల్లో ప్రతిభ చూపిన వేలూరు జిల్లా పెరియతమల్ చెరువు ప్రాథమిక పాఠశాల విద్యార్థి జేసు గాబ్రియేల్, తిరువణ్ణామలై జిల్లా అవనియాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని యమున, కాశీనాయకన్‌పట్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి, రాణిపేట జిల్లాకు చెందిన విద్యార్థిని కలైఅరసి, కృష్ణగిరి జిల్లాకు చెందిన అర్ష్‌బర్మన్, ధర్మపురి జిల్లాకు చెందిన కీర్తన, చెంగల్పట్టు జిల్లాకు చెందిన శ్వేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను వేలూరు వీఐటీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ విశ్వనాథన్ అందజేశారు.

ఎంసీసీలో పూర్వ విద్యార్థుల సమావేశం

పెరంబూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పెట్‌లోని మద్రాసు క్రిస్టియన్ కాలేజ్ హైయ్యర్ సెకండరీ స్కూలు (ఎంసీసీ)లో ఆదివారం మధ్యాహ్నం పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు అన్బిల్ మహేష్, పీకే శేఖర్‌బాబు హాజరయ్యారు. కార్యక్రమంలో 1974 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మాట్లాడుతూ... తాము చదివి, ఉన్నత స్థితికి కారణమైన పాఠశాలను మరచిపోకుండా పూర్వ విద్యార్థులు సమావేశం కావడం అభినందనీయమన్నారు. అలాగే, రాష్ట్రంలోని ఇతర పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంసీసీ కరస్పాండెంట్ డా.జీజే మనోహర్, ప్రధానోపాధ్యాయులు జి.జెబదాస్ దినకరన్, 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు జీఎం శ్రీధర్ వందయార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్ తదితరులు